ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 22 సంచిక : 10 జూన్ 2017

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 04-11-1984, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మనకి ఆదిగురువు నారాయణుడు. ఈ సృష్టిని సృష్టించి భగవంతుడు గాలికి విడిచిపెట్టెయ్యలేదు. ఈ సృష్టిలో ఉన్న జీవులు ఎవరు ఏవిధంగా ప్రవర్తించుకోవాలి, ఏవిధంగా ప్రవర్తిస్తే వాళ్ళకి జ్ఞానం కలుగుతుంది అని మొట్టమొదట మనకి జ్ఞానబోధ చేసింది పరమేశ్వరుడే. పరమేశ్వరుడు మనకి ఆదిగురువు, అతనే నారాయణుడు.

ప్రతి మతానికి స్థాపకుడు ఉన్నాడు. బౌద్ధమతానికి బుద్ధుడు ఉన్నాడు. క్రైస్తవ మతానికి క్రీస్తు ఉన్నాడు. అలాగే జైనమతానికి జైనుడు ఉన్నాడు. అంతకుముందు వాళ్ళకి మతం లేదు. ఈ సృష్టి ఎప్పుడైతే ప్రారంభించిందో అప్పుడే మన హిందూమతం కూడా ప్రారంభం అయింది. అందుకే దీనిని సనాతనమతం అన్నారు. ఏ మతానికైనా ఫౌండర్ ఉన్నాడు కానీ హిందూమతానికి ఒక స్థాపకుడు లేడు. హిందూమతానికి స్థాపకుడు ఎవరని మీరు మాస్టారుని అడిగితే వారు ఎవరో వ్యక్తిపేరు కోసం వెతుక్కుంటారు. అంటే గౌతమబుద్ధుడులాగా, ఏసుక్రీస్తులాగా హిందూమతానికి కూడా ఒక స్థాపకుడు ఉన్నాడేమోనని వ్యక్తి పేరుకోసం వెతుక్కుంటారు. ఒకవేళ మనం చిన్నప్పుడు ఎవరైనా వ్యక్తి పేరు చదువుకొన్నామా, మనం మర్చిపోయామేమోనని పిల్లలు అడిగిన ప్రశ్నకి మాస్టార్లు వెనక్కి తిరిగి చూసుకొంటుంటారు. అసలు వ్యక్తి ఉంటే కదా వాళ్ళ పేరు చెప్పటానికి? అందుకనే హిందూమతాన్ని సనాతనమతం అన్నారు. ఈ సృష్టి ప్రారంభించిన రోజునే ఈ మతం కూడా ప్రారంభం అయ్యింది.

అందుచేత మీకు రెలిజియన్సులో హిందూమతం కంటే ఏన్షియంట్ రెలిజియన్ ప్రపంచంలో ఎక్కడా లేదు. అయితే నాకేమీ మత పిచ్చ లేదు. మన హిందూమతం యొక్క గొప్పతనం చెప్పటం

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 16
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)
చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 12/-
చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥
పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....
04-11-1984
జిన్నూరు

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

కోసం ఈ మాటలన్నీ చెప్పటంలేదు. మతం అనేది పిచ్చ అయితే వెంటనే ఆ పిచ్చని ఆపుచేసేయటం మంచిది. అయితే సందర్భం వచ్చింది కాబట్టి హిందూమతం యొక్క విశేషం చెప్పకుండా విడిచిపెట్టటం న్యాయం కాదు కాబట్టి నేను చెబుతున్నాను కానీ కేవలం ఇతర మతాల కంటే మన మతం యొక్క ఔన్నత్యం ఎక్కువ ఉందని చెప్పటం కోసం చెప్పటం కాదు. సందర్భం వచ్చినప్పుడు విడిచిపెట్టకుండా చెప్పాలి కాబట్టి మన మతానికి న్యాయం చెయ్యవలసిన బాధ్యత నా మీద ఉంది కాబట్టి చెపుతున్నాను. మన మతంలో కేవలం ఒక ఆత్మ గురించే చెప్పలేదు. సమస్త సైన్సెస్ గురించి, నాలెడ్జి యొక్క అన్ని బ్రాంచెస్ గురించి కూడా మన వేదంలో చెప్పబడ్డాయి. లెక్కలు చెప్పారు, చరిత్ర చెప్పారు, భూగోళం చెప్పారు, ఆస్ట్రాలజీ చెప్పారు, ఆయుర్వేదం చెప్పారు. ఇలా లోకానికి సంబంధించిన అన్ని విద్యలూ కూడా వేదంలో ఉన్నాయి. అయితే మీరు ఎన్ని విద్యలు తెలుసుకొన్నప్పటికీ మీరెవరో మీకు తెలియనప్పుడు మీకు దుఃఖం ఆగదు. అందుచేత ఇవన్నీ చెప్పకొస్తూ ఇదే డెస్టినేషన్ అని చెప్పలేదు. ఇల్లు ఎలా కట్టుకోవాలో చెప్పారు. పెళ్ళి ఎలా చెయ్యాలో చెప్పారు. సమస్త విద్యలూ చెప్పారు. మనిషి తల్లికడుపులో నుండి బయటికి వచ్చిన తరువాత, వాడిని వల్లకాడులోకి తీసుకెళ్ళి తగులబెట్టేవరకూ, ఈ లోపల వాడి ప్రవర్తన ఎలా ఉండాలో అన్నీ చెప్పారు. చిన్న పిల్లలప్పడు ఎలా ఉండాలి, వివాహం అయిన తరువాత గృహస్థ జీవితంలో ఎలా ఉండాలి, ముసలివాళ్ళు అయిన తరువాత బాధ్యతలు అన్నీ వదిలేసుకొని నిరంతరం పరమేశ్వరుడిని స్మరిస్తూ చివరిజీవితం ఏ విధంగా గడపాలి, ఇలా సమస్తం మన మతంలో చెప్పారు. తల్లి కడుపులోంచి పుట్టిన తరువాత బారసాల మొదలు వాడు మరణించినప్పడు చదివే మంత్రాల వరకూ కూడా మన హిందూమతంలో చెప్పారు. వాడిని ఉయ్యాలలో పడుకోబెట్టింది మొదలు, వాడిని చివరికి స్మశానంలోకి సాగనంపేవరకూ ఆ జీవుడికి చెయ్యవలసిన కార్యక్రమమంతా చెప్పారు. అయితే ఇది అంతా మన లక్ష్యం కాదు. జరగవలసిన కార్యక్రమం గురించి చెప్పారు. ఇప్పడు మనం ఇక్కడినుంచి కలకత్తా వెళ్ళాలంటే రైలు ఎక్కుతాం, కారు ఎక్కుతాం, గుఱ్ఱపుబండి ఎక్కుతాం, టాక్సీ ఎక్కుతాం. ఎన్నో మారుతూ ఉంటాము. ఇన్ని వెహికల్స్ వూరికే మారతూ ఉంటాము కానీ మన డెస్టినేషన్ అదికాదు. మనం కారులో కూర్చుంటాం, కారులో కూర్చోవటానికా, ఎక్కడికో వెళ్ళటానికి కారులో కూర్చుంటున్నాము. అదే విధంగా ఈ సమస్త విద్యలూ అసలు డెస్టినేషన్‌కి తీసుకువెళ్ళటానికి సహకరించటం కోసం చెప్పారు. మనకోశరీరం ఉంది కాబట్టి ఈ శరీరాన్ని ఎలా పోషించుకోవాలి, ఈ శరీరం ద్వారా ఆత్మని తెలుసుకోవటానికి ఎలా కృషి చెయ్యాలి అనేటటువంటి మీన్స్ కూడా ఎంతో చెప్పకొచ్చారు వేదాలలో. అందుచేత మన హిందూమతానికి సనాతనమతం అని ఏవిధంగా అయితే పేరు ఉందో వేదమతం అని కూడా పేరు ఉంది. అంటే దీని వేళ్ళు వేదాలలో ఉన్నాయి కాబట్టి వేదమతం అని పేరు ఉంది.

గౌతమబుద్ధుడు అయినా ఏసుక్రీస్తు అయినా, మహమ్మద్ అయినా, ఏ మతానికి సంబంధించిన వాళ్లైనా, వీళ్లు భగవంతుని యొక్క ప్రతినిధులు. కాని స్వయంగా భగవంతుని ముఖంలోంచి వచ్చిన మతం హిందూమతం. ఋషులు అందరూ కూడా వాళ్లు ఆలోచించి వ్రాసినవి కాదు, వాళ్లు శబ్దాన్ని విన్నారు. విన్నవన్నీ రికార్డు చేసారు, అవే వేదాలు. అంతేగానీ ఇది తప్పా రైటా అని ఆలోచించి చెప్పిన మాటలు కాదు. వేదాలని శృతి అంటారు. వాళ్లేదో చదువుకొని జ్ఞాపకం తెచ్చుకొని చెప్పిన మాటలు కాదు. శృతి అంటే వినపడటం, వాళ్లకి వినపడ్డవి రికార్డు చేసారన్న మాట అంతే కాని ఏదో పుస్తకాలు చదువుకొని ఏదో జ్ఞాపకం తెచ్చుకొని, పరీక్షలలో పిల్లలు రాసినట్టు అటువంటివి కాదు వేదాలు. వాళ్లు నగ్న సత్యాలని, యూనివర్స్‌లో ఉన్నటువంటి కొన్ని ట్రూత్స్, ఈశ్వరుని యొక్క దయ వల్ల వాళ్లకి వినపడితే ఆ విన్నవన్నీ వాళ్లు రికార్డు చేసారు. వాటినే వేదాలు అంటారు.

అయితే ఈ వేదాల యొక్క సారమే భగవాన్ చెప్పిన మాటలు. చెరుకుగడని పిండితే రసం వస్తుంది. రమణస్వామి ఏం చేసారంటే ఈ నాలుగు వేదాలని పీచు లేకుండా పిండి ఆ రసంలో కొంత నిమ్మకాయ వేసి పట్టిస్తే ఎంత హాయిగా ఉంటుందో, ఈ నాలుగు వేదాల సారాన్ని, ఏది ముఖ్యమో ఆ విషయాలని పిండి ఆత్మవిద్యని భగవాన్ మనకి చెప్పారు. చెరుకుగడ ఇచ్చి తినమంటే పిల్లవాడు తినగలడా, వాడికి పెద్దవాళ్లు ఎవరైనా రసం తీసి ఇచ్చి తాగమంటే తాగగలడు. అటువంటి పిల్లలం కాబట్టి భగవాన్ వేదాలని పిండి అందులో ముఖ్యమైన విషయాలని మనకి చెప్పి ప్రాముఖ్యం లేని మాటలని వదిలేసారు.

మనం జీవితంలో ఏం చేస్తున్నామంటే ప్రధానమైన విషయాలని వదిలేస్తున్నాము. అప్రధానమైన విషయాలని వేసుకొని తిరుగుతున్నాము. ఏదైతే ప్రధానమో, ముఖ్యమో, ప్రథమమో అది వదిలేస్తున్నాము. అప్రధానమైన విషయాలని ప్రధానంగా తీసుకొంటున్నాము. అంటే గుర్రాన్ని ముందుంచాలి, బండినేమో వెనకాల ఉంచాలి, కానీ మనం గుర్రాన్ని వెనకాల కట్టి బండిని ముందు పెడుతున్నాము. ఇంక బండి ఎలా వెళ్తుంది? గుర్రం ముందుంటే బండి వెళ్తుంది కానీ. మన జీవితాలు అలా ఉన్నాయి.

మనం సంసారజీవితం కానీ, సాంఘీకజీవితం కానీ, రాజకీయజీవితంకానీ, ఏ రకమైన జీవితం గడిపినా, మీ లక్ష్యం ఆత్మ అయి ఉండాలి. మీరు గుర్రపుబండి మీద వెళ్లినా, రైలు మీద వెళ్లినా, కారు మీద వెళ్లినా, విమానం మీద వెళ్లినా, మీ డెస్టినేషన్ ఏంటో ముందు మీకు తెలిసుండాలి. తరువాత ఈ ప్రయాణాలు వూరికే మీన్స్. మీకున్న ధనాన్ని బట్టి మీరు వెహికల్ సెలెక్ట్ చేసుకొని వెళ్తారు. కానీ డెస్టినేషన్ ఏంటో తెలిసుండాలి కదా! మీకందరికీ తెలివితేటలు ఉన్నాయి, రూపాయలు ఉన్నాయి, కానీ ఆ తెలివితేటలని రూపాయలని ఎలా ఖర్చు పెడుతున్నారో అది ముఖ్యం. మీకందరికీ శరీరాలు ఇంద్రియాలు ఉన్నాయి, ఆ శరీరాలని, ఇంద్రియాలని ఎలా ఉపయోగించుకుంటున్నారో అది కావాలి.

ఎన్ని సంవత్సరాలు జీవించామ అన్నది సమస్య కాదు. ఈ జీవించిన సంవత్సరాలలో ఎలా జీవించామ అన్నది చాలా ముఖ్యమైన విషయం. ఏసుక్రీస్తు 32 సంవత్సరాలు జీవించాడు. వివేకానంద 39 సంవత్సరాలు జీవించాడు. శాంతా జ్ఞానేశ్వర్ 18-19 సంవత్సరాలే జీవించాడు. ఇలా మహాత్ములందరూ చిన్న చిన్న జీవితాలు గడిపి, ఈ లోకాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోయారు. ఈ లోకంలో ఉన్నదేదో వాళ్ళకి తెలుసు, అందుచేతే ఈ లోకాన్ని విడిచిపెట్టినప్పుడు వాళ్ళకి దుఃఖం రాలేదు. ఈ లోకంలో ఉన్నదేదో వాళ్ళకి తెలుసు, అందుచేతే ఈ లోకాన్ని విడిచిపెట్టినప్పుడు వాళ్ళకి దుఃఖం రాలేదు. ఈ లోకంలో ఏముంది? ఏ దేశంలో చూసినా, ఏ రాష్ట్రంలో చూసినా, ఏ ఖండంలో చూసినా రాగద్వేషాల యొక్క విలాసం తప్పించి ఏముంది ఈ లోకంలో? మీరు యూనివర్శిటీలకి వెళ్ళి చూడండి. వాళ్ళేదో గొప్ప చదువులు చదువుకొన్నారు పెద్ద జీతాలు పుచ్చుకొంటున్నారు అని మనం అనుకొంటాము. ప్రమోషన్ రాలేదని వాడు ఏడుస్తూ ఉంటాడు. వాడికి సబ్జక్టు ప్రధానం కాదు, వాడికి ప్రమోషన్ రాలేదని వాడి ఏడుపు. వాడేదో పెద్ద ప్రొఫెసర్‌గా చేస్తున్నాడు చాలా గొప్ప లెవెల్లో ఉన్నాడని మనం అనుకొంటాము. ఏమీ లేదు, ఏ ఖండంలో చూసినా రాగద్వేషాల యొక్క విలాసమే.

కొంతమంది అంటారు మేము కష్టపడి సాధనలు చేస్తున్నాము ఏమీ అభివృద్ధి కనిపించటం లేదు అని. అయితే మీరు అభివృద్ధిలోకి రావటంలేదని మీకు ఎలా తెలుసు? మేము ప్రతి ఆదివారం వస్తున్నాము, ముక్కు మూసుకొంటున్నాము, సాధనలు చేస్తున్నాము అని మీరు అనుకొంటూ ఉండవచ్చు. అభివృద్ధిలోకి రావటంలేదు అనుకోవచ్చు, అభివృద్ధిలోకి రావటంలేదని మీకెలా తెలుసు? జీవితంలో ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి. సంవత్సరం పొడుగునా చదువుతారు, పరీక్ష రాసేది ఒక్క రోజున. వాడు పాసా, ఫెయిలా ఆ రోజున తెలిసిపోతుంది. మామిడికాయ తయారవ్వటానికి నాలుగు నెలలు చెట్టుని అంటిపెట్టుకొని ఉంటుంది, అయితే రాలటానికి నాలుగు నెలలు పడుతుందా? మీ సాధన అభివృద్ధి అవుతోందో లేదో చూసి మార్కులు వేసేవాడు ఈశ్వరుడు. మీకు జ్ఞానం అలా ఒక సెకనులో వచ్చేస్తుంది. మీరు పూరికే పక్వం అవ్వాలి. అయితే దురదృష్టం ఏమిటంటే ఇంకా మనం పక్వానికి రాలేదు. పక్వానికి రాకపోవటం వల్ల భగవంతుడు చెప్పిన మాటలు అబద్ధాలని ఈ లోకులు చెప్పకొనే మాటలు అన్నీ నిజాలని అలా మన అపరిపక్వమైనటువంటి మనస్సు అటు లాగేస్తుంది. మీరు ఏదైనా పండు ముగ్గిన తరువాత తింటే తియ్యగా ఉంటుంది, అదే పండు ముగ్గకుండా తింటే చేదుగా ఉంటుంది. పక్వానికి రాని మనస్సులకి భగవంతుడు చెప్పిన మాటలు చేదుగా ఉంటాయి.

ఆ మనిషి స్వభావం అటువంటిది ఈ మనిషి స్వభావం ఇటువంటిది అని అంటూ ఉంటారు కదా! ఆ స్వభావం అంటే ఏమిటి అని మీరెప్పుడైనా ఆలోచించారా? మనిషి

యొక్క వాసనలను బట్టి మంచి వాసనలు ఉంటే మంచి స్వభావం, చెడ్డ వాసనలు ఉంటే చెడ్డ స్వభావం అంటారు. స్వభావం అంటే వాసనను బట్టి నిర్ణయిస్తారు, అంతకంటే ఏమీ లేదు. ఒక మనిషి ముఖం మీద మంచివాడని, ఇంకొక మనిషి ముఖం మీద చెడ్డవాడని ఎక్కడైనా వ్రాసి ఉంటుందా? ఏమీ లేదు. లోపల వాసనలు సంస్కారాలు మంచివి ఉంటే మంచివాడు, చెడ్డవి ఉంటే చెడ్డవాడు అంటారు, అంతకంటే ఏమీ లేదు. వాసనలు మారిపోయాయి అనుకోండి చెడ్డవాడు మంచివాడు అవ్వచ్చు, మంచివాడు కూడా చెడ్డ స్నేహాల వల్ల చెడ్డవాడు అవ్వవచ్చు. హోలీ కంపెనీ విడిచిపెట్టేసి, దురదృష్టం వల్ల చెడ్డ కంపెనీలోకి వెళ్తే వాడు చెడ్డవాడు అవ్వవచ్చు.

భగవాన్ చెప్పింది అక్షరాలా నిజం. ఇవాళ ఇందిరా గాంధీ మరణించింది అనుకోండి, ఏమిటి ఇలా మరణించింది, తుపాకులు పెట్టి కాల్చేసారేంటి ఆమాత్రం రక్షణ తెలియదా అనుకొంటారు. ఆవిడ ఇంటి చుట్టూ వందమంది మిలిటరీ వాళ్ళని కాపలా పెట్టారు, ప్రజలు వచ్చి ఆవిడని చంపేస్తారేమోనని, ఈ వందమందీ ఆవిడని రక్షిస్తారని పెట్టారు. ఆవిడని ఎవరైతే కాపలా కాస్తున్నారో వారే చంపేస్తారని ఎవరికీ తట్టలేదు. ఈశ్వరుడి యొక్క మాయ ఎవడికీ తెలియదు. మనిషికి చావు వస్తుంది, కానీ ఎప్పుడు వస్తుందో, ఎక్కడ వస్తుందో, ఎలా వస్తుందో ఈశ్వరుడికి తప్పించి జీవుడికి తెలియదు. ఏ తుపాకులైతే ఆవిడ రక్షణ కోసం పెట్టారో, ఆ తుపాకులే ఆవిడని కాల్చేసాయి. అదే ఈశ్వరుడి యొక్క మాయ. ఇప్పుడు మనం ఇలా కూర్చున్నాము. రేపు ఎలా ఉంటామో మనకి తెలియదు. ఇప్పుడు అందరం ఆరోగ్యంగానే ఉన్నాము, రేపు ఏం జరుగుతుందో మనకి తెలియదు. ఇద్దరు సిక్కులు కలిసి ఆవిడని చంపారు. అందులో ఒకడికి బయట డ్యూటీ పడింది. వాడు నాకు లోపల డ్యూటీ వెయ్యండి అని అడిగాడు. అప్పుడుకూడా ఆఫీసరుకి అనుమానం రాలేదు వాడు లోపల డ్యూటీ ఎందుకు అడుగుతున్నాడు అని. ఎందుచేతనంటే ఇందిరా గాంధీ లోపల ఏ ఈశ్వరుడైతే ఉన్నాడో, ఆవిడని చంపినవాడిలో కూడా ఆ ఈశ్వరుడే ఉన్నాడు, ఆఫీసులో ఉన్న మనిషిలో కూడా ఈశ్వరుడే ఉన్నాడు. మీ రంగు వేరు అవ్వవచ్చు, నా రంగు వేరు అవ్వవచ్చు, మీ వయస్సు నా వయస్సు వేరు అవ్వవచ్చు, మీ కులం, జాతి, దేశం వేరు అవ్వవచ్చు, నా కులం, జాతి, దేశం వేరు అవ్వవచ్చు, కానీ మీలో నాలో ఉన్నది ఒక్కడే ఈశ్వరుడు. బయట ఉన్నవాడు లోపల డ్యూటీ అడుగుతున్నాడు అని ఆఫీసులో ఉన్న వాళ్ళకి ఎవరికీ కూడా అనుమానం రాలేదు. ఎందుచేతనంటే అక్కడ అనుమానం రానివ్వడు ఈశ్వరుడు. ఇక్కడ గ్రహించవలసిన పాయింట్ ఏమిటి అంటే ఆవిడకి మరణం అలా వ్రాసి ఉన్నప్పుడు ఈశ్వరుడు అనుమానం రానివ్వడు.

నిజమైన అరుణాచలం అంటే మన ఆత్మే. మనలో ఉన్న ఆత్మే నిజమైన అరుణాచలం. భగవాన్ ఏమి చెప్పారంటే మీరు కొండని చూస్తున్నారు, గుడిని, గుడిలో దేవుడిని చూస్తున్నారు

కానీ ఈ క్షేత్రం యొక్క విశేషం ఏమిటి అంటే ఈశ్వరుడు ఇక్కడ మనలాగా రక్తమాంసాలతో శరీరధారుడై ఒక వటవృక్షం క్రింద ఆ కొండ మీద కూర్చుని ఉన్నాడని భగవాన్ చెప్పారు. అక్కడ గిరిరూపంలో ఈశ్వరుడు ఉన్నాడు, లింగరూపంలో ఈశ్వరుడు ఉన్నాడు. ఇప్పుడు మనకి రక్తమాంసాలు ఎలా ఉన్నాయో, అలా శరీరధారుడై ఈశ్వరుడు అక్కడ వటవృక్షం క్రింద కూర్చున్నాడు అని ఎప్పుడో భగవాన్ పురాణంలో చదివారు. మర్రి ఆకులు మామూలుగా చిన్నవి ఉంటాయి కదా, ఆ చెట్టుకి పెద్ద ఆకులు ఉంటాయట. ఆ చెట్టు క్రింద కూర్చుని ఉంటాడట ఈశ్వరుడు. ఆ క్షేత్రం యొక్క విశేషం అది అని చెప్పారు.

ఒక రోజున భగవాన్ కొండ మీద తిరుగుతూ ఉంటే ఎక్కడి నుంచో ఒక పెద్ద బ్రహ్మాండమైన మర్రి ఆకు గాలికి ఎగిరి వస్తోంది. ఎక్కడి నుండి వస్తోంది ఇది, మర్రి ఆకు ఇంత పెద్దది ఉంటుందా? అరుణాచల పురాణంలో ఈశ్వరుడు చెట్టు క్రింద కూర్చున్నాడని ఉంది, చెట్టు కూడా కనిపిస్తోందే, అయితే ఆ చెట్టు క్రింద ఈశ్వరుడు కూర్చుని ఉన్నాడు అన్నమాట అనుకొన్నాడు. అయితే ఆ చెట్టు దగ్గరికి మనం వెళ్ళాలనుకొన్నారు భగవాన్. ఈయనకి దృష్టి అంతా చెట్టు మీద ఉంది. ఇది మీరు గ్రహించండి. ఆ చెట్టు చూసుకుంటూ అలా వెళ్ళిపోతున్నారు. క్రింద చూసుకోలేదు. సరిగ్గా ఆయన కాలు తేనెపట్టు మీద వేసేసరికి తేనెటీగలు కసికొద్దీ విపరీతంగా కుట్టేసాయి. ఆయన కాలు వెనక్కి తీసేసారు. అప్పుడు భగవాన్ ఒక మాట చెప్పారు. ఎప్పుడైతే నన్ను తేనెటీగలు కుట్టాయో, అసలు ఆ మర్రిచెట్టు దగ్గరకి వెళ్ళాలనే తలంపు కూడా పోయింది. ఇందులో ఒక రహస్యం ఉంది. ఆ తేనెటీగలు ఆయనని కుట్టకపోతే, ఆయన కనుక మర్రిచెట్టు దగ్గరికి వెళ్ళి ఉంటే, రమణమహర్షి మనకి కనబడకపోదురు. లోకానికి బోధ ఉండేదికాదు. అక్కడ ఉన్నవాడు ఈశ్వరుడు. ఈయన ద్వారా బోధ జరగాలి, ఎప్పుడైతే తేనెటీగలు వచ్చి కుట్టేసినాయో మళ్ళీ ఆ మర్రి చెట్టు దగ్గరకి వెళ్ళాలనే సంకల్పం పుట్టలేదు ఆయనకు. వెనక్కి వచ్చేసారు. ఎందుచేత అక్కడ ఆపుచేసారంటే, ఆ శరీరం అక్కడికి వెడితే మళ్ళీ రాదు. ఆయన ద్వారా టీచింగ్ అవసరం లోకానికి. అందుచేత అక్కడే ఆపేసారు.

భగవాన్ సిద్ధాంతం ప్రకారం తల్లి కడుపులోంచి బయటికి వచ్చినది మొదలు స్మశానం లోకి వెళ్ళేవరకు ఎక్కడ ఎలా ఉండాలి అనేది నిర్ణయించి అప్పుడు శరీరాన్ని పంపిస్తారు. ఎవరి జీవితమైనా అంతే, స్త్రీ జీవితమైనా పురుషుడి జీవితమైనా అంతే. అంటే తల్లి కడుపులో శరీరం తయారు అవుతుండగానే, ఏ సెకనులో ఎక్కడ ఉండాలో, మళ్ళీ ఏ రోజున ప్రాణం విడిచిపెట్టాలో, ఈ శరీరాన్ని ఎక్కడ దహనం చెయ్యాలో కూడా అక్కడ పిక్చర్ తయారైపోతుంది. మనం ఒక ఊరిలో పుడతాం, ఒక ఊరు వెళతాం మళ్ళీ ఈ శరీరం ఇంకెక్కడో చోట దహనం అవుతుంది. ఈ శరీరం ఏ ఊళ్ళో దహనం అవుతుందో తెలియదు. ఈ శరీరం ఎక్కడ దహింపబడాలో అన్నీ కూడా ఈశ్వరుడి ప్రణాళికని బట్టి జరుగుతాయి.

ఆయన సాక్షిగా ఉన్నాడు, అందుకే ఈశ్వరుడిని సర్వజ్ఞుడు అన్నారు. ఇంతమంది కోట్లాది జీవులు ఉండగా, ఏ జీవుడు ఏ కర్మ చేసాడో దానిని బట్టి ఆ జీవుడి యాత్ర నడుస్తూ ఉంటుంది. అదే ఈశ్వరుడి యొక్క రచన. రమణమహర్షి స్వతంత్రుడు అనుకోకండి మీరు. ఆయన కూడా ఈశ్వరుడి స్వాధీనంలో ఉన్నాడు. ఆయనే కనుక ఈశ్వరుడి స్వాధీనంలో లేకపోతే ఆయన పళనిస్వామికి మోక్షం ఇచ్చి ఉండేవాడు. తల్లి విషయంలో సక్సెస్ అయ్యాడు కానీ పళనిస్వామి విషయంలో ఫెయిల్ అయ్యాడు ఆయన కూడా. పళని స్వామికి మోక్షం వచ్చేసింది కదా అని చెయ్యి తీసేసాడు ఆయన. అంటే అలా అనిపించాడు లోపల ఈశ్వరుడు. ఎందుచేతనంటే ఇంకో జన్మ వ్రాసి ఉంది పళనిస్వామికి. ఈయనకి అలా అనిపించకపోతే ఆయనకీ మోక్షం వచ్చేదాకా విడిచిపెట్టడు. మోక్షం వచ్చేసింది అని ఈశ్వరుడు అనిపించాడు అందుచేత చెయ్యి తీసేసాడు, ప్రాణం బయటకు పోయింది పళనికి. ఆ ఇన్సిడెంట్ కూడా ఈశ్వరుడి చేతిలో ఉంది.

మాకు జ్ఞానం రాలేదు అని మీరు అనుకొంటున్నారు కానీ, అసలు మీకు అర్హత, యోగ్యత ఉంటే జ్ఞానం ఎంతసేపు వస్తుంది? చీర కొనుక్కోవటానికి డబ్బులు రెడీగా ఉన్నాయనుకోండి, ఎంతసేపు మీకు చీరు కొనుక్కోవటం? అలాగే అసలు మీకు అర్హత, యోగ్యత ఉంటే ఎంతసేపు ఈ క్షణంలో వచ్చేస్తుంది జ్ఞానం. కాకపోతే అర్హత, యోగ్యత సంపాదించుకోవాలి. మీరు డిజర్వ్ అయితే ఈ క్షణంలో వచ్చేస్తుంది జ్ఞానం. ఒక సింపుల్ విషయం - మీరంటే మీరు చాలా ఇష్టపడుతున్నారు. మీరంటే మీకు ఇష్టమే కదా, మిమ్మల్ని మీరు ఎప్పుడైనా ద్వేషించుకొన్నారా? మీలో రాముడిని కృష్ణుడిని ద్వేషించే వాళ్ళు ఉండవచ్చు, మీ అమ్మగారిని, మీ భర్తలని, మీ అత్తగారిని, మీ కోడళ్ళని ద్వేషించే వాళ్ళు ఉండవచ్చు, కానీ మిమ్మల్ని మీరు ఎప్పుడైనా ద్వేషించుకొన్నారా? అదీ నేను అడిగేది. ఎందుచేత మిమ్మల్ని మీరు ద్వేషించుకోలేదు అంటే మీరు సుఖ స్వరూపులు. మీరే సుఖం, అందుచేత మిమ్మల్ని మీరు ఎప్పుడూ ద్వేషించుకోరు. సుఖం అనేది మీలోనే ఉంది కాబట్టి మిమ్మల్ని మీరు ఎప్పుడూ ద్వేషించుకోరు. మిమ్మల్ని మీరు ప్రేమించుకొంటున్నారు, ఎందుచేతనంటే ఆ సుఖాన్ని తెలుసుకోవటం కోసం. ప్రతీ మనిషి తనని తాను ప్రేమించుకొంటాడు కానీ తనని తాను ద్వేషించుకోడు. తనని తాను ప్రేమించుకోవటానికి కారణం తనలోనే నిజమైన సుఖం ఉంది.

భగవాన్ నిన్ను నువ్వు తెలుసుకో అని ఎందుకు చెప్పారు? నిన్ను నువ్వు తెలుసుకొంటేనే కానీ ఆ సుఖం ఏమిటో అది ఎలా ఉంటుందో నీకు తెలియదు. అందుచేత నిన్ను నువ్వు తెలుసుకోమనటం. మన ఇంద్రియాలలో సుఖం ఉందనుకుంటాం, దేహంలో సుఖం ఉందనుకుంటాం, సమాజంలో సుఖం ఉందనుకుంటాం, లోకంలో సుఖం ఉందనుకుంటాం. ఇలా ఎన్ని జన్మలో, వేలాది లక్షలాది జన్మలు తిరిగి తిరిగి సుఖం లేనిచోట దానికోసం వెతుకుతూ ఉంటాము. ఇంద్రియాలలో సుఖం ఉందని, లోకంలో

ఉందని, సమాజంలో ఉందని, అధికారంలో ఉందని, పేరులో ఉందని, కీర్తిలో ఉందని, ఎక్కడెక్కడో స్వర్గలోకంలో ఉందని, వైకుంఠంలో ఉందని కైలాసంలో ఉందని, ఇతర లోకాలలో ఉందని ఎక్కడెక్కడో వెతుకుతాము. ఎన్ని కోట్ల సంవత్సరాలు ఇలా వెదికినా ఎన్ని యుగాలు వెతికినా దొరకదు, అది అసలు అక్కడ ఉంటే కదా! పైగా ఈ మనస్సు మనని మాయ చేసి యజ్ఞాలని, యాగాలని ఎన్నో చేయిస్తూ ఉంటుంది. భోగాలు అనుభవిస్తుంది. మీరు అనుభవించే ప్రతి భోగం వెనకాల దుఃఖం ఉంటుందని జీవుడికి తెలియదు. భోగం అనుభవించేటప్పుడు బాగుంటుంది. భోగం వెనకాల జబ్బుందని, భోగం వెనకాల దుఃఖం ఉందని ఈ జీవుడికి తెలిస్తే అసలు భోగం జోలికి వెళ్ళడు కదా!

లోకంలో కనిపించే ప్రతి వస్తువు మీద మనకి ఆశ పుడుతుంది. ఎందుచేత ఆశ పుడుతుంది, అది మనల్ని సుఖపెడుతుందని అనుకొంటాడు. లోకంలో కళ్ళతో చూసేవి అన్నీ మనకి కావాలి అనిపిస్తోంది, చెవులతో వినేవి అన్నీ మనకి కావాలి అనిపిస్తోంది, అవన్నీ సంపాదించి ఇంట్లో పెట్టుకొని మనం సుఖపడదామని. అవి సంపాదించాక, కొంతకాలం అనుభవించాక తెలుస్తుంది అందులో సుఖం లేదని, మళ్ళీ అవి విడిచిపెట్టేస్తాడు, ఇంకో కొత్త వాటిల్లోకి వెళతాడు. డబ్బు లేనివాడు, డబ్బుంటే చాలు సుఖపడొచ్చు అనుకొంటాడు. డబ్బు వచ్చాక అనిపిస్తుంది, ఇందులో సుఖం లేదు అని. అప్పుడు ఏ పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు పదవో సంపాదించాలి అనుకొంటాడు. డబ్బు ఒకటే ఏం చేస్తుంది, అధికారంలో సుఖం ఉంది అని వాడు అనుకొంటాడు. ఇలా మన మనస్సులో ఉన్న పాపమే మనల్ని బాహ్య ప్రకృతిలోకి ఈడ్చి పిండి చేసి జనన మరణ చక్రంలో పిప్పి చేసి విడిచిపెట్టేస్తుంది. చెరుకు గెడని గానుగలో పెట్టినప్పుడు ఎలా పిప్పి చేస్తుందో, అలా ఈ ప్రకృతి మనల్ని పిండి చేసి అది మనల్ని విడిచిపెట్టకుండా మనల్ని నలిపేస్తుంది. ఎక్కడ నిజం ఉందో తెలియదు, ఎక్కడ సుఖం ఉందో తెలియదు, ఎక్కడ సత్యం ఉందో తెలియదు. ఈ ప్రశ్నలు వేసే వాళ్ళు, వాళ్ళు అడిగేది చాలా పెద్ద ప్రశ్న అనుకొంటారు. ఈ మధ్యన ఉన్నత విద్యావంతుడు ఒక ప్రశ్న వేసాడు. అహంకారం మీరు కాదు, మీరు ఆత్మ అని అంటున్నారు కదా, మరి నాకు అహంకారం ఉంది మీరు కాదంటే పోతుందా అన్నాడు. అది కాదు ఇక్కడ అర్థం. మీరు అహంకారంలో ఉన్నప్పుడు కూడా ఇదిగో ఇది అహంకారం, ఇది మనం కాదు అని ముందసలు మీరు సబ్జక్టు అర్థం చేసుకోవాలి. అప్పుడు విడిపోవటం అలవాటు అవుతుంది.

ఇప్పుడు మనం జిన్నూరులో ఉన్నాం, మనం పాలకొల్లు వెళ్ళాలి అనుకోండి, ఇదే పాలకొల్లు అనుకొంటే ఇంక మనకు ఆలోచన పుట్టదు. ఇది పాలకొల్లు కాదు అనుకొన్నప్పుడు పాలకొల్లు ఎక్కడ ఉందని మన మనస్సు వెదకటం ప్రారంభిస్తుంది. ఇదే పాలకొల్లు అనుకొంటే మన మనస్సు ఇంక ఆలోచించదు కదా! ఇక్కడ భగవాన్ చెప్పే అందాలు చూడండి. నువ్వు ఏ గమ్యాన్ని అయితే చేరాలనుకొంటున్నావో దానినే లక్ష్యంగా పెట్టుకోమంటున్నారు.

మజిలీలు వద్దంటున్నారు. నువ్వు ఏ ఆత్మనైతే తెలుసుకోవాలనుకొంటున్నావో దానినే లక్ష్యంగా పెట్టుకో. నువ్వు ఆత్మ కానిదానిని ఆత్మ అనుకొంటావనుకో దానిని విడిచిపెట్టటం తప్పదు. అది నీకు దుఃఖం తీసుకురాక మానదు.

మనకి ఆదిగురువు నారాయణుడు. నారాయణుడు చెప్పే మాటలలో మనకేమీ విశ్వాసం కలగటంలేదు. దానికి కారణం ఏమిటి? ఈశ్వరుడు చెప్పిన మాటలు అబద్ధాలా? అందుకే మనకు విశ్వాసం కలగటం లేదా? అదికాదు. భగవంతుడి మీద, భగవంతుడు చెప్పిన మాటల మీద మనకి విశ్వాసం కలగకపోవటానికి కారణం ఒకటే - మనలో ఉన్న పాపం. మనలో పాపం ఉన్నంతసేపు మనలను సంశయాలు పీడిస్తూనే ఉంటాయి. ఏ మనిషిలో అయితే పాపం ఉందో వాడిని సంశయం పీడిస్తుంది. ఆ పాపమే వాడిని భగవంతుడు ఉన్నట్టు నమ్మనివ్వదు, ఆ పాపమే వాడిని భగవంతుడి మాటలు విననివ్వదు, ఆ పాపమే భగవంతుడి వైపు నడవనివ్వదు. ఈ పాపం మీకు దారి ఇచ్చేవరకు ఈ మాయ మీకు దారి ఇచ్చేవరకు ఈ ప్రకృతి మిమ్మల్ని విడిచిపెట్టే వరకు ఈశ్వరుడి వంక మీరు కన్నెత్తి చూడలేరు. అసలు ఆయన మాటలే వినలేరు. నిరంతరము పేడలో ఉండే పురుగుల్ని తీసుకొచ్చి బంగారపు గిన్నెలో పెడితే మటుకు ఆ పేడలో ఉండే పురుగులకి తెలుస్తుందా, అవి అందులో ఉంటాయా?

సోదరమహాశయులారా! మీలో మీరు ఒకరినొకరు మోసగించుకోవచ్చు. మిమ్మల్ని నేను మోసం చెయ్యవచ్చు. మీరు కూడా నన్ను మోసం చేయవచ్చు. అయితే మీరు కానీ, నేను కానీ భగవంతుడిని మోసం చెయ్యలేము. మీరు కానీ, నేను కానీ, ఈ లోకం కానీ, ఈ కనిపిస్తున్నటువంటి ప్రకృతి కానీ భగవంతుడిని మోసం చెయ్యలేరు. ఒక జీవుడు ఇంకొక జీవుడిని మోసం చెయ్యగలడు కానీ, జీవుడు ఈశ్వరుడిని మోసం చెయ్యలేడు. ఎందుచేతనంటే ఇక్కడ తలంపు రాకముందే వీడికి ఏ తలంపు వస్తుందో ఈశ్వరుడికి తెలుసు. వాడు ఈశ్వరుడు. టి.పి. రామస్వామి అయ్యరు గారు ఒకసారి భగవాన్‌ని చూడటానికి వెళ్ళారు. సర్వసాధారణంగా భగవాన్ దండలు వేయించుకోవటానికి ఒప్పకోరు. టి.పి. రామస్వామి అయ్యరు మద్రాసు నుంచి ఒక పెద్ద దండ తీసుకొచ్చి బలవంతాన భగవాన్ మెడలో వేసారు. మద్రాస్ వాళ్ళకి విగ్రహాలన్నా, దండలన్నా సరదా! ఒక పది నిమిషాలు కూర్చుని టి.పి. రామస్వామి అయ్యరు వచ్చేస్తున్నాడు. అప్పడు ఎవరో భోజనానికి పిలిచారు. అప్పడు భగవాన్ అక్కడున్న వాళ్ళనెవరినో పిలిచి, ఆయన భోజనం చెయ్యడు, ఇంకో అరగంట ఉన్నాక పాలు అడుగుతాడు, పాలు ఇవ్వండి అన్నారు. ఇంకో అరగంట ఉన్నాక పాలు తాగుదామనే సంకల్పం ఇంకా రామస్వామి అయ్యరుగారికి కలగలేదు ఇంకో అరగంట తరువాత కలుగబోతోంది. ఇంకో అరగంట ఉన్నాక కలుగబోయే ఆ ఆలోచన ఇప్పడు చెపుతున్నాడు. వాడు ఈశ్వరుడు.

నిడుబ్రోలు కాలేజీ ప్రిన్సిపాల్ సుబ్బరామయ్యగారు, ఆయన భార్యతో ఒకసారి భగవాన్‌ని చూడటానికి వెళ్ళారు. భగవాన్‌తోటి మాట్లాడారు. సుబ్బరామయ్యగారు భగవాన్‌తో మళ్ళీ మేమిద్దరం కలిసి వస్తాము అన్నారు. నువ్వు వస్తావు అన్నారు భగవాన్. అంటే ఈలోపల ఆవిడ జారిపోతుంది అన్నమాట. భగవాన్ ఎందుకు ఇలా అంటున్నారో అసలు ఆయనకు అర్థం కాలేదు. అయితే భగవాన్ ఇటువంటి మాయలో మనని ఎప్పుడూ పెట్టలేదు. ఇవన్నీ అనవసరం. నువ్వు ఏ రోజున చనిపోతావో నేను చెపితే దానివల్ల ఏమిటి నీకు కలిసివచ్చేది? ఒకవేళ మరణించిన మనిషిని నేను నిజంగా బ్రతికిస్తాననుకో ఈ దేశంలో ఉన్న శవాలన్నీ అరుణాచలం రమణాశ్రమానికి వస్తాయి అన్నారు. మనిషిని బ్రతికించటం ప్రధానం కాదు. వాడిని జ్ఞానిని చెయ్యాలి, అది ఆయన లక్ష్యం. చచ్చిపోయిన మనిషి బ్రతికితే గొప్ప కాదన్నాడు. వాడిని ఈ శరీరంలోనే బ్రతికించటం ఎందుకు? ఎలాగైనా ఇంకో శరీరం వస్తుంది వాడికి, ప్రకృతే ఇస్తుంది. ఇంక నేను ఇవ్వటం ఎందుకు అన్నాడు. ఎవరు మరణించినప్పటికీ మనం ఎవరూ బెంగపెట్టుకోవద్దు, బాధ పడవద్దు అన్నాడు. వీళ్ళంతా తిరిగి పుట్టే రకాలే అన్నాడు. మరణించిన వాడు ప్రతివాడు పుడతాడు కాబట్టి వీళ్ళ గురించి నువ్వు ఆలోచించవద్దు. ఎవడైతే తిరిగి జన్మించడో వాడు మరణించినట్టు లెక్క అన్నారు ఆచార్యస్వాములవారు. మనం తిరిగి జన్మిస్తాము కాబట్టి మరణించినా అది మరణం కాదన్నాడు.

జ్ఞానం పొందటంకోసం మోక్షం పొందటం కోసం మీకు బయట ఏమైనా అడ్డు వస్తున్నాయా? మన సంకల్పాలు అడ్డు వస్తున్నాయి, మన తలంపులు అడ్డు వస్తున్నాయి, మన కోరికలు అడ్డు వస్తున్నాయి. బయట ఎవరూ మనకి అడ్డు రావటంలేదు. భగవద్గీతలో కృష్ణుడు మీరు కోపాన్ని విడిచిపెట్టేయండి భయాన్ని విడిచిపెట్టేయండి అని చెప్పాడు కదా! మీరు తలంపులు విడిచిపెట్టేయండి, అప్పుడు ఇంక భయం లేదు, కోపం లేదు. తలంపు లేకుండా భయం ఉందా? తలంపు లేకుండా కోపం ఉందా? తలంపు లేకుండా కామం ఉందా? మీకు తలంపు వచ్చాక కోపం వస్తోందా? తలంపు లేకుండా కోపం వస్తోందా? లేకపోతే కామం వస్తోంది అనుకోండి - తలంపుతో వచ్చిందా? తలంపు లేకుండా వచ్చేసిందా? లేకపోతే ఎదుటి వాళ్ళ మీద ద్వేషం వచ్చిందనుకోండి - తలంపు లేకుండానే ద్వేషం వచ్చేసిందా? తలంపుని విడిచిపెట్టి ఇవన్నీ ఏమున్నాయి? మీ అందరి క్షేమం నేను కోరను అనుకోండి, నాకు జ్ఞానం ఎలా కలుగుతుంది? లోకంలో జీవుల క్షేమం ఎవడైతే కోరడో వాడు జ్ఞాని ఎలా అవుతాడు? వాడికి జ్ఞానం ఎలా కలుగుతుంది?

మన శరీరాలు శవాలు అన్న సంగతి మనం గుర్తుంచుకోవాలి. మన శరీరాలు అన్నీ శవాలే అనే నిర్ణయానికి రావాలి. మన ఇంద్రియాలతోటి, మన మనస్సుతోటి, మన వాక్కుతోటి మనం చేసిన పొరపాట్లకి మనని శిక్షించటం కోసం ఒక శరీరం ఇచ్చి శిక్షింపచేస్తాడు. శరీరం వద్దు అంటే కుదరదు. శరీరం ఇచ్చి శిక్షింపచేస్తాడు. ఇప్పుడు ఈ శరీరంతోటి పొరపాట్లు

చేస్తాము అనుకోండి మళ్ళీ ఇంకో శరీరం ఇచ్చి శిక్షింపచేస్తాడు. శరీరం ఇవ్వకపోతే వాడికి శిక్ష ఎలాగ? ఒకవేళ నాకు శరీరం వద్దు అంటారనుకోండి, మీరు వద్దన్నా అది ఆగదు. ప్రకృతి మీకు శరీరాన్ని తయారుచేసి, శరీరాన్ని ఇచ్చి శిక్షింపచేస్తుంది. రామచంద్రరాజు గారు నాకు స్నేహితుడని మీరందరూ అనుకోవచ్చు. రామచంద్రరాజుగారు నాకు స్నేహితులు కాదు. అయితే రామచంద్రరాజుగారు నాకు ఏమవుతారు? శిష్యులు అవుతారా? శిష్యులూ కాదు. లేకపోతే నాకు భక్తులు అవుతారా? భక్తులూ కాదు. రామచంద్రరాజుగారు నాకు స్నేహితులూ కాదు, శిష్యులూ కాదు, భక్తులూ కాదు. మరి ఇవేవీ కాకపోతే నాకు ఏమవుతారు? రామచంద్రరాజుగారు ఎవరంటే అది నాకు తెలియదు. ఆయన నా జీవితంలోకి చాలా ఆలస్యంగా ప్రవేశించారు. ఆలస్యంగా ప్రవేశించినా నిలకడగా ఉండటానికి ప్రవేశించారు. ప్రవేశించటం ఆలస్యంగానే కానీ శాశ్వతంగా ఉండటానికి ప్రవేశించారు. సిమెంటుతోటి, ఇటుకలతోటి మీ హృదయాలని కట్టుకోవటానికి ప్రయత్నం చెయ్యవద్దు. మీకు సిమెంటు ఉన్నంతమాత్రంచేత ఇటుకలు ఉన్నంతమాత్రంచేత మీ హృదయంలో సంస్కారం వస్తుందని మీరెవరూ అనుకోవద్దు. ఇప్పుడు మనమేదో ఆశ్రమం కట్టాలనుకొంటున్నాం. ఆశ్రమం కట్టినంత మాత్రంచేత, మన నెత్తిమీద ఏదో వచ్చి పడిపోతుందని మనమందరం జ్ఞానులం అయిపోతామని, అలా ఎవరూ ఊహించకండి. అందులో ఏమీ లేదు. ఇక్కడ ఒక చిన్న రహస్యం ఉంది. శివుడి అనుగ్రహం వల్ల జ్ఞానం కలుగుతుంది అంటున్నారు. మనం ఎంతో కొంత భక్తిగా ఉంటున్నాము అందుచేత ఈ మాటలు వచ్చి వింటున్నాము అని మీరందరూ అనుకొంటున్నారు. శివానుగ్రహం కనుక లేకపోతే అసలు ఈ ఆదివారం మీరెవరూ ఇక్కడికి రాలేరు. ఇక్కడికి శ్రద్ధగా వస్తున్నాము అన్న ఉద్దేశ్యం మీద మీరెవరూ అహంకారం తెచ్చుకోవద్దు. మీ అంతట మీరు ప్రయత్నం చేసి ఇక్కడికి రాలేదు. మేము ప్రతి ఆదివారం శ్రద్ధగా వింటున్నాము అని గర్వం కూడా మీకెవరికీ వద్దు. ఎందుచేతనంటే శివానుగ్రహం కనుక మీకు లేకపోతే, శివుడిని మీరు స్మరించలేరు. ఇక్కడికి రాలేరు. అహంకారం ఆయన కాల్చకపోతే, మనలో ఉన్న దుర్వాసనలు ఈశ్వరుడు కాల్చకపోతే మనల్ని మనం నిప్పు పెట్టుకోగలమా? మన దుర్వాసనలని మనం కాల్చుకోగలమా? చంటిపిల్లలు మన ఇంటిదగ్గర ఎప్పుడైనా అల్లరి చేస్తూ ఉంటారనుకోండి, ఏ లక్కపిడతలో పడేసి ఆడుకోమంటాము. అలాగే భగవంతుడు మనకి రూపాయలు పడేసాడు వాటితోటి ఆడుకోవటానికి. భగవంతుడు మనకి కొంచెం కీర్తి, కొంచెం రూపాయలు, కొంచెం ఏవో లోకానికి సంబంధించిన గొడవలు - ఇవి పడేసాడు ఆడుకోమని. మనం అవే నిజం అనుకొంటున్నాము. చిన్నపిల్లలు లక్కపిడతలు నిజం అనుకొని వాటితో ఆడుకొంటున్నారు. మనకి డబ్బులు ఇవి పడేసాడు, వీటితో ఆడుకొంటున్నాము. మనమూ పిల్లలమే. ఆధ్యాత్మికంగా పిల్లలమే. మీరు ఈ ప్రపంచంలో చాలా గొప్ప సంఘటనలు, చాలా గొప్ప విషయాలు

అనుకొనేవి అన్నీ కూడా బహుస్వల్పమైన విషయాలు, అల్పమైన విషయాలు. మన దృష్టిలో చంటిపిల్లలు ఆడుకొనే లక్కపిడతలు ఎటువంటివో, ఈశ్వరుడి దృష్టిలో ఏవిషయాలైతే చూసి మనం గర్వపడుతున్నామో, ఆ విషయాలన్నీ కూడా లక్కపిడతలతో సమానం.

ఒక భక్తుడు భగవాన్ దగ్గరకి వచ్చి నేను ఈ భక్తుడిని చూసాను, పురాణాలలో ఆ భక్తుడి గురించి చదివాను అంటున్నాడు. వాడు భగవాన్ దగ్గరకి వచ్చి పురాణంలో చదివినవి చెపుతున్నాడు. భగవాన్ అదంతా విన్నారు. విన్న తరువాత నువ్వు చదివినవి చెపుతున్నావు, నీ ఎదురుగా ఉన్న వాడెవడో నీకు తెలియటంలేదు అన్నారు. మన హృదయంలో దోషం ఉన్నప్పుడు కళ్ళున్నా కనబడదు, చెవులున్నా వినలేము. శివానుగ్రహం కనుక మీకు లేకపోతే అసలు మీకు భక్తే కలుగదు. మీరెవరైనా భగవంతుడిని స్మరించుకొంటున్నారు అనుకోండి, భగవంతుడు మిమ్మల్ని స్మరించాడు కాబట్టి మీరు భగవంతుడిని స్మరిస్తున్నారు. లేకపోతే మీరెవరు స్మరించటానికి? మేము భగవంతుడిని గంట సేపు స్మరిస్తున్నాము అని మీరు అనుకొంటున్నారు. కానీ భగవంతుడు మిమ్మల్ని స్మరించకపోతే, మీరు భగవంతుడిని స్మరించలేరు. ఇంక మీకు గర్వం ఎందుకు? అహంకారం ఎందుకు? కొంతమంది చూడండి, నేను చెప్పాను, నేను చెప్పాను అంటారు. నేను నాది ఈ రెండూ కూడా గర్వంలో భాగాలే. కొంతమంది ప్రతి మాటకీ నేను, నాది అని వూరికే ఎక్కువగా వాడుతూ ఉంటారు. ఇవన్నీ కూడా గర్వానికి అలంకారాలు. పెళ్ళికూతురికి మనం ఎలాగైతే అలంకారాలు చేస్తామో అదేవిధంగా ఈ నేను, నాది కూడా అహంకారానికి అలంకారాలు.

కొంతమంది మేము సాధన చేస్తున్నామని చెపుతారు. సాధన చేస్తూ అహంకారాన్ని అలంకరించుకొంటారు. ఇలా అహంకారాన్ని అలంకరించుకొంటే వాడు అజ్ఞానంలో కూరుకుపోతాడు. చాలామంది భక్తి పేరు మీద ఆధ్యాత్మిక సాధనల పేరు మీద అహంకారాన్ని అలంకరించుకొంటున్నారు. అహంకారాన్ని అలంకరించుకొనే వాడికి ఈశ్వరుడు దర్శనం ఎలా ఇస్తాడు? కొంతమంది ఇంట్లో ఉన్న వస్తువులు ఎదుటి వాళ్ళకి ఇచ్చేటప్పుడు రెండు అరటిపళ్ళు ఉన్నాయనుకోండి, మంచి అరటిపండు వాళ్ళకి ఇచ్చి, నాసి అరటిపండు ఇంటిలో ఉంచుకొంటారు. అదేవిధంగా కొంతమంది మనుషులు వాళ్ళ హృదయంలో కొన్ని గొప్ప విషయాలు ఉండవచ్చు, కొన్ని మామూలు విషయాలు ఉండవచ్చు, ఆ గొప్ప విషయాలని ఎక్స్‌ప్రెస్ చేస్తుంటారు, సామాన్య విషయాలని ఎక్స్‌ప్రెస్ చెయ్యరు. కొంతమంది ఎదుటివాళ్ళకి సంతోషాన్ని పంచిపెడతారు, దుఃఖాన్ని వాళ్ళు దాచుకొంటారు. వాళ్ళ దుఃఖాన్ని ఎదుటివాళ్ళకి పంచిపెట్టటం ఎందుకని? ప్రతీ జీవితానికి సుఖం ఉంటుంది దుఃఖం ఉంటుంది. ప్రతీ జీవితానికి మంచి ఉంటుంది చెడ్డ ఉంటుంది. ఇది ప్రకృతి యొక్క స్వభావం. మంచి చెడ్డల మిశ్రమమే సుఖదుఃఖాల మిశ్రమమే ఈ ప్రకృతి. కొంతమంది వాళ్ళ సుఖాన్ని సంతోషాన్ని ఎదుటివాళ్ళకి పంచిపెడతారు, దుఃఖం వుంటే వాళ్ళు మింగేస్తారు. కొంతమంది

మనుషులు ఏంచేస్తారంటే సుఖమంతా వాళ్ళు అనుభవిస్తారు, దుఃఖం మటుకు ఉంటే సమాజానికి పంచిపెడతారు. ఆముదం పుచ్చుకున్న తరువాత సర్వసాధారణంగా ఎవరూ రోడ్డుమీదకి వెళ్ళరు, ఇంటివద్దే ఉంటారు. అలాగే దుఃఖం కూడా అందరికీ పంచిపెట్టటం ఎందుకు? ఇంటివద్దే ఉందాము అని వాడు అనుకోడు. వచ్చి సమాజానికి అంటిస్తాడు. సమాజాన్ని దాటని వాడికి జ్ఞానం కలుగదు. మనిషికి పెద్ద గేటు సమాజం.

ఈ ఒక్క మాట వినండి, మిగతా మాటలన్నీ మీకు నచ్చకపోతే నాకు ఇచ్చేయండి. ఈ శరీరం మీకు దగ్గరగా ఉన్నట్టు అనిపిస్తోంది మీ మనస్సు మీకు దగ్గరగా ఉన్నట్టు అనిపిస్తోంది, మీరు ప్రేమించే దేవుడు మీకు దగ్గరగా ఉన్నట్టు అనిపిస్తున్నాడు. మీ రాముడో, కృష్ణుడో, శివుడో వీళ్ళందరూ మీకు దగ్గరగా ఉన్నట్టు అనిపిస్తున్నారు. కానీ వీటన్నింటికంటే ఆత్మ మీకు దగ్గరగా ఉంది. అది నిజం. అది మీకు తెలియటంలేదు. రాముడు, కృష్ణుడు, శివుడు ఎక్కడ ఉన్నారు? మీకు బయట ఉన్నారా? లోపల ఉన్నారా? మీకు బయట ఉన్న బొమ్మలు, బయట ఉన్న ప్రతిమలు, దేవుళ్ళు, దేవతలు, వీళ్ళందరికంటే కూడా మీ ఆత్మ మీకు దగ్గరగా ఉంది. వీటన్నింటికంటే ఈ ప్రకృతి కంటే మీ ఆత్మ మీకు సమీపంలో ఉంది. మీకు అతి సమీపంలో ఉన్న మీ ఆత్మని మీరు వదిలేసి ఎవరినో ప్రార్థించాలి అనుకొంటారు. ఇదే మాయ. అలా ప్రార్థించవద్దు అని నేను అనటంలేదు, మళ్ళీ ఏదో ఒక జీవితంలో అక్కడ ఆగి ఆత్మ దగ్గరకి రావలసిందే. మీకు కనిపించే ప్రతిమ నిజంకాదు, మీలో ఉన్న ఆత్మ నిజం. మీరు ఆ ప్రతిమలని ప్రార్థించి ప్రార్థించి, ఈ జన్మలోనైనా మళ్ళీ జన్మలోనైనా, ఈ జీవితంలోనైనా మరో జీవితంలోనైనా, ఈ లోకంలోనైనా మరొక లోకంలోనైనా ఆత్మ దగ్గరకి రావలసిందే. ఏదో రోజున ఆత్మ దగ్గరకి రావలసిందే. కానీ ఈ రోజునే ఆత్మని ఎందుకు లక్ష్యంగా పెట్టుకోరు? వాయిదాలు ఎందుకు వేసుకోవటం? కోటి జన్మల తరువాత అయినా మనం ఆత్మని తెలుసుకోవలసిందే? మన హృదయంలో ఉన్న ఆత్మని తెలుసుకోవాలి. అప్పటివరకూ మోక్షం రాదు. కోటి జన్మల తరువాత చేసే పని ఇప్పడే ఇక్కడే ఎందుకు చెయ్యకూడదు?

త్రిపురాలు అంటే మన కారణ శరీరం, సూక్ష్మ శరీరం, స్థూల శరీరం. ఈ మూడు శరీరాలను ఎవడైతే దహిస్తాడో వాడే ఈశ్వరుడు. వాడే మనకి నిజమైన గురువు. స్థూల శరీరం మీకు కనిపిస్తుంది. లోపల ఇంకా రెండు శరీరాలు ఉన్నాయి. స్థూల శరీరం మీ కళ్ళకి కనిపిస్తోంది, ఇందులో మాంసం ఉంది - రక్తం ఉంది. ఈ ఒక్క శరీరమే స్మశానంలో కాలుతుంది. లోపల ఉన్న రెండు శరీరాలు కాలవు. మనిషికున్న మూడు శరీరాలలో స్మశానంలో కాలేది ఈ కళ్ళకి కనబడే శరీరం ఒక్కటే. లోపల ఉన్నవి సుక్ష్మశరీరం, దాని లోపల కారణశరీరం. సూక్ష్మశరీరం అంటే మనస్సు - అంటే మీ మంచి చెడ్డలు, రాగద్వేషాలు, సంసారం గొడవలు, ఇష్టాయిష్టాలు. ఇవన్నీ మనస్సులో ఉన్నాయి. నాకు ఫలానా వాళ్ళ మీద కోపం వచ్చింది అంటారు మీరు. కోపం మీ శరీరంలో ఉందా? మీ మనస్సులో ఉందా?

మీ మనస్సులోనే ఉంది. దానినే సూక్ష్మశరీరం అంటారు. దాని లోపల ఇంకోశరీరం ఉంది. అది కత్తిరించాలి. ఆ కారణశరీరం కత్తిరించేవరకు వాడు జ్ఞాని అవ్వలేడు. ఈ మూడు శరీరాలని కాల్చేవాడు ఈశ్వరుడు. ఈ శరీరాన్ని ఇక్కడ పుల్లలే కాల్చేస్తాయి. పోనీ ఇందిరా గాంధీ శరీరాన్ని మంచి గంధపు చెక్కలు కాలిస్తే, మన శరీరాలని పిడకలు కాలుస్తాయి. ఎలాగైనా బూడిద అవ్వవలసిందే. ఆవిడ శరీరం కూడా స్మశానానికి వంద మంది వస్తే, పోనీ మన కూడా నలుగురైనా వస్తారు. పోనీ ఆవిడకి భజంత్రీలు ఉన్నాయి, మనకి భజంత్రీలు లేవు. నలుగురైనా రావాలి కదా మోసేవాళ్ళు. మనం ఎవరినైతే పెద్ద స్నేహితులు అనుకొంటున్నామో వాళ్ళు మనం చనిపోతే స్మశానం వరకూ వస్తారా? లోపల రాగద్వేషాలతో, ఇష్టాయిష్టాలతో కూడిన ఒక శరీరం ఉంది, దానిలోపల ఇంకో శరీరం ఉంది, దానిని కారణశరీరం అంటారు. ఆ శరీరం తెగేవరకూ స్థూలశరీరం, సూక్ష్మశరీరం వస్తూనే ఉంటాయి. ఈశ్వరానుగ్రహం వల్ల తప్ప దానిని ఎవరూ కత్తిరించలేరు. కారణశరీరం అంటే అజ్ఞానం. మంచి వాడికీ అజ్ఞానం ఉంటుంది, చెడ్డవాడికీ అజ్ఞానం ఉంటుంది. మంచి చెడ్డ మీ మనస్సులో ఉన్నాయి. లోపల అజ్ఞానం ఉంటుంది. ఆ అజ్ఞానం తెగే వరకు వాడు జ్ఞాని కాలేడు. ఆ అజ్ఞానానికి వేదాంత శాస్త్రంలో కారణ శరీరం అని పేరు. ఈ మూడు శరీరాలను ఒక్క ఈశ్వరుడే కాలుస్తాడు. నా అహంకారాన్ని నేను కాల్చుకోగలనా? నా కారణ శరీరాన్ని నేను కాల్చుకోగలనా? నా మనస్సుని నేను కాల్చుకోగలనా? లేకపోతే నా రాగద్వేషాలని నేను బయటకి తీసుకోగలనా?

మీరు మనస్సు అనుకొంటున్నారు. మనస్సే నేను అనుకొన్నప్పుడు దానిని నేను ఎలా పోగొట్టుకొంటాను? ఎవడి శిరస్సు మీద ఈశ్వరానుగ్రహం ఉందో వాడి యొక్క సూక్ష్మశరీరాన్ని, కారణశరీరాన్ని ఈశ్వరుడు కత్తిరిస్తాడు. అయితే ఎవడి మీద ఆ అనుగ్రహం పడుతుంది? నూటికి నూరుపాళ్ళు తన శరీరంతోటి, మనస్సుతోటి, ఇంద్రియాలతోటి, బుద్ధితోటి పరమేశ్వరుడిని ఎవడైతే ఆరాధిస్తున్నాడో, వాడి నెత్తిమీద మటుకే పరమేశ్వరానుగ్రహం పడుతుంది. వాడిని మోక్షం వరిస్తుంది. మీ మనస్సు బహిర్ముఖం అవుతోంది, అంతర్ముఖం అవ్వటంలేదు. పరమేశ్వరుడు మీ హృదయంలో ఉన్నాను అని చెపుతున్నాడు. పరమేశ్వరుడు మీ హృదయంలో ఉన్నాను అని చెప్పినప్పటికీ మీ మనస్సు అక్కడికి ఎందుకు వెళ్ళటంలేదు? అదే పాప దోషం. పోనీ మీరు కాలాన్ని ఎప్పుడైనా ఈశ్వరుడికి ఇచ్చారా? మనం 70 సంవత్సరాలు జీవిస్తే, ఆ 70 సంవత్సరాలలో ఎంతకాలం మనం ఈశ్వరుడికి ఇచ్చాము? కానీ ఒక విషయం మీరు మరిచిపోకండి. ఏదో సరదాకి ఆదివారాలు వచ్చి మీరు ఇక్కడ కూర్చున్నప్పటికీ మీ జీవితంలో మధురమైన ఘడియలు, విలువైన ఘడియలు, వెలకట్టటానికి వీలులేని ఘడియలు ఇవి మటుకే. ఇది అంత ముఖ్యం కాదు, మన ఇంట్లో ఉన్న పనులే చాలా ముఖ్యం అని మీరు అనుకోవచ్చు. కానీ మీ జీవితం తరువాత లెక్కలోకి వచ్చేవి ఇవే. మీ కాలాన్ని ఎప్పుడైనా పరమేశ్వరుడికి

ఇచ్చారా? కొంతమంది అనొచ్చు ఏమండీ మాకు డబ్బులేదు అందుచేత పువ్వులు కొనలేము, బత్తాయిలు కొని ఈశ్వరుడికి ఇవ్వలేము అనొచ్చు. పోనీ కాలం ఉంది కదా! మీ కాలాన్ని ఎప్పుడైనా ఈశ్వరుడికోసం ఖర్చుపెట్టారా? ప్రతి మనిషికీ వాడి ఇంద్రియాలు అంటే వాడికి ఇష్టం. అవి మనకి శాంతిని తీసుకొస్తున్నాయా అశాంతిని తీసుకొస్తున్నాయా? మన ఇంద్రియాలు మనలను పాడుచేస్తున్నాయా లేకపోతే మనని ఉన్నత స్థితికి తీసుకువెళు తున్నాయా? అవి మనకి ఉపకారం చేస్తున్నాయా? అపకారం చేస్తున్నాయా? మీరు ఎవరి ఇంటికి వెళ్ళి కూర్చున్నా ఏమండీ మా మేనమామ ఇలా దగా చేసాడనో, మా అత్తగారు దగా చేసిందనో, మా అమ్మగారో తాతగారో దగా చేసారనో ఇదే గొడవలు కానీ నా ఇంద్రియాలు నన్ను దగా చేసాయి అని ఎవడైనా చెపుతున్నాడా? మన ఇంద్రియాలు మన స్వాధీనంలో ఉంటే లోకంలో ఎవరూ మనని దగా చెయ్యలేరు. లోకంలో ఎవరూ మనల్ని ఏమీ చేసేది లేదు. మన ఇంద్రియాలు మన స్వాధీనంలో లేకపోతే, లోకంలో ఎంతమంది ఉపకారం చెయ్యాలనుకొన్నా చెయ్యలేరు. ఒకవేళ ఉపకారం చేసినా అది బూడిదలో పోసిన పన్నీరే. చెవిటి వాడి దగ్గర శంఖం ఊదినట్టే. మాకు చాలా దుఃఖంగా, ఆందోళనగా ఉంది అంటారు అనుకోండి. మీ ఇంద్రియాలు మీకు ఆందోళన తీసుకొస్తున్నాయా లేకపోతే లోకులు తీసుకొస్తున్నారా? మీ ఇంద్రియాలు మిమ్మల్ని నిరంతరం అశాంతిలో ముంచేస్తోంటే, ఆ ఇంద్రియాలనే మీరు ఎందుకు ప్రేమిస్తున్నారు? ఆ ఇంద్రియాల మీదకే మీ దృష్టి ఎందుకు వెడుతోంది? నీకు కళ్ళుఉండటం మంచిదే, కానీ నీ కళ్ళు నీకు అపకారం చేస్తుంటే గుడ్డివాడిగా ఉండటమే మంచిది. నీ కళ్ళు నీకు అపకారం చేస్తుంటే వాటిని పీకి అవతల పారేయి. నీ జీవితం పొడుగునా నరకంలో పడటం కంటే రెండు కళ్ళూ లేకపోవటం మంచిదే కదా!

ఎవరి మనస్సు అయితే చంటిపిల్లల మనస్సులా ఉంటుందో, ఎవరి హృదయం అయితే చంటిపిల్లల హృదయంలా నిర్మలంగా ఉంటుందో, వాడి మీద ఈశ్వరానుగ్రహం పడుతుంది. మన హృదయాలు ఎవరివైనా చంటి పిల్లల హృదయాలు ఎలా ఉంటాయో అలా నిర్మలంగా ఉన్నాయా? అసలు నీ హృదయంలో ఉన్న ఆత్మ నీకు దర్శనం ఇస్తే, అప్పుడు వైకుంఠం మీ చేతిలోకి పెట్టినా మీరు విడిచిపెట్టేస్తారు. మన హృదయంలో ఉన్న ఆత్మ మనకి తెలియని మూలంగా ప్రాపంచిక శక్తులు, ప్రాపంచిక విషయాలు మనల్ని ఆకర్షిస్తున్నాయి. ఆ పరిధిలో మనం ఉన్నాము. ఎప్పుడైతే మనకి ఆత్మ దర్శనం అయ్యిందో ప్రపంచంలో ఏ వస్తువు కూడా మనల్ని ఆకర్షించలేదు. మనకి ప్రపంచంలో ఏ వస్తువు మీదైనా ఆకర్షణ కలుగుతోందంటే లోపల అజ్ఞానం ఉన్నట్లే. మనిషికున్న పెద్ద రోగం అజ్ఞానం. లోపల అజ్ఞానం ఉన్నంతకాలం కొత్త శరీరాలు వస్తూనే ఉంటాయి. ఆచార్యులవారు ఏమన్నారంటే నీకు రోగం వస్తే, డాక్టరుగారు ఒక బిళ్ళ వేసుకోమంటే ఒక్క బిళ్ళే వేసుకొంటావు కానీ నాలుగు బిళ్ళలు వేసుకోవు. అలాగే ఆకలి కూడా ఒక రోగమే. నీ ఆకలికి సరిపడే

తినమన్నారు. అతిగా మాట్లాడకుండా అతిగా భోజనం చెయ్యకుండా అతిగా నిద్రపోకుండా అన్నీ సమపాళ్లలో ఉండి యుక్తంగా జీవించే వాడికి యోగం లభిస్తుంది. ఎవడైతే యుక్తంగా జీవిస్తున్నాడో వాడు యోగి అవుతాడు. యోగంలోంచి జ్ఞానం వస్తుంది, భోగంలోంచి రోగం వస్తుంది.

రమణస్వామిది విచారణామార్గం. విచారణామార్గంలో భక్తి అవసరమే. కర్మ అవసరమే. విచారణామార్గం విచారణామార్గం అంటే వూరికే వచ్చేస్తుందా? మీరు శరీరం ద్వారా మంచి పనులు చేస్తూ ఉంటే, మీ మనస్సుని భక్తితోటి పక్వం చేసుకొంటూ వుంటే, మీరు చేసే నిష్కామ కర్మ, మీకున్న భక్తి, మీకున్న యోగం, మీరు చేస్తున్న ధ్యానం, ఇవన్నీ కూడా విచారణామార్గానికి సహకరిస్తాయి. భగవద్గీతలో భగవంతుడు, జ్ఞాన మార్గం చెప్పాడు, భక్తి మార్గం చెప్పాడు, యోగ మార్గం చెప్పాడు, విచారణామార్గం చెప్పలేదు కదా అని మీరు అనుకోవచ్చు. మీరు చేసే నిష్కామ కర్మ, భక్తి మార్గం, యోగ మార్గం ఈ మార్గాలన్నీ కూడా విచారణా మార్గానికి సహకరిస్తాయి. ఎవడైతే ఆత్మ గురించి అన్వేషిస్తున్నాడో వాడికి ఆత్మ లభిస్తుంది. ఆస్బోర్న్ మనుమరాలు వెళ్లిపోతూ - భగవాన్ మేము ఇంగ్లాండ్ వెళ్లిపోతున్నాము అప్పుడప్పుడూ మమ్మల్ని జ్ఞాపకం తెచ్చుకుంటూ ఉండండి అని అడిగింది. మా దేశం వెళ్లిపోతున్నాము మేము మిమ్మల్ని జ్ఞాపకం ఉంచుకొంటాము అనటంలేదు, మీరు మమ్మల్ని జ్ఞాపకం పెట్టుకోండి అంటోంది. చిన్న పిల్ల ఎంత తెలివిగా అడుగుతోందో చూడండి. అప్పుడు భగవాన్ అన్నారు నువ్వు నన్ను స్మరించుకో, అప్పుడు నేను నిన్ను స్మరిస్తాను, సరిపోతుంది అన్నారు. ఇఫ్ యు రిమెంబర్ భగవాన్, భగవాన్ విల్ రిమెంబర్ యు. నువ్వు భగవంతుడిని స్మరిస్తే భగవంతుడు కూడా నిన్ను స్మరిస్తాడు. రెండూ అవసరమే. భగవాన్ ఏమంటున్నారంటే నిన్ను స్మరించుకోమంటున్నావు, నిన్ను తలపెట్టుకోమంటున్నావు, బాగానే ఉంది నేను నిన్ను తలపెడతాను, మరి నీ మాట ఏమిటి? నువ్వు నన్ను తలపెట్టుకో, నువ్వేమో నన్ను తలపెట్టు, నేను నిన్ను తలపెడతాను సరిపోతుంది. అంటే ఏంటి - జ్ఞానం రావటానికి ఇవి రెండూ అవసరమే. ఈ అమ్మాయి చేసేది పురుష ప్రయత్నం, భగవాన్ జ్ఞాపకం ఉంచుకోవటం ఈశ్వరానుగ్రహం. ఒక మనిషి జ్ఞాని అవ్వాలంటే ఇటు ప్రయత్నమూ కావాలి, అటు ఈశ్వరుడు అనుగ్రహమూ కావాలి. రెండూ అవసరమే అన్నారు భగవాన్.

చివరిగా ఒక మాట చెప్పి ముగిస్తున్నాను - మీ మనస్సు నూటికి నూరుపాళ్ళు ఆత్మని కోరకుండా, ఒక వంతు అయినా ప్రకృతి మీదకి ఎక్కడైనా స్లిట్ అవుతుంటే ఇంక మీకు ఆత్మ దొరకదు. ఇది బాగా జ్ఞాపకం ఉంచుకోండి. మీ మనస్సుకి నూరు శక్తులు ఉంటే, ఆ నూరు శక్తులూ ఆత్మ వైపు కేంద్రీకరించబడితేనే ఆత్మ తెలుస్తుంది కానీ కనీసం మీ మనస్సులో కొంత భాగమైనా ప్రకృతిలోకి వచ్చేస్తుంటే ఇంక మీకు ఆత్మ తెలియబడదు.

జూన్ 18 చావలి సూర్యనారాయణమూర్తి (అమలాపురం హెడ్‌మాష్టారు) గారి ప్రవచనం, జన్నూరు శ్రీ రమణక్షేత్రం

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# స్వరూపం అమృతం

వాస్తవముగా మనము అమృత స్వరూపులమే! సచ్ఛిదానందమే మన నిజ స్వరూపం. అట్టి స్వరూప ఆత్మయే సకల విశ్వమునకు ఆధారముగా, మహాచైతన్యముగా ప్రకాశిస్తోంది. అందువల్లనే 'సర్వంఖల్విదంబ్రహ్మ' అన్నది ఉపనిషత్ వాక్యం. బ్రహ్మము అసంగమై, అంతటా వ్యాపించి ఉంది. కేవలము బ్రహ్మము తప్ప రెండవ వస్తువు లేనే లేదు. కాబట్టి ఆ మహాచైతన్యము యొక్క వెలుగులో అఖండమైన 'నేను'గా జీవించడమే నిజమైన జీవనము. జీవితమందలి సర్వ అనర్థాలను, వెలితిని, దుఃఖమును, జనన-మరణ రూప సంసార భ్రాంతిని, ఆత్మజ్ఞానమే నిర్మూలిస్తుంది. తాను శాంతిగా జీవించడానికి మరియు కుటుంబము, దేశము, ప్రపంచము యొక్క అభివృద్ధికి ఆత్మజ్ఞానముతో జీవించడమే ఏకైక మార్గము. దేహాత్మబుద్ధి కారణంగా దుఃఖమునకు, అశాంతికి లోనై జనన మరణ సంసార చక్రంలో చిక్కుకుంటున్నాము. వాస్తవంగా తాను ఎవరో అనుభవైకవేద్యం చేసుకున్నప్పడే స్వరూపశాంతి తానుగా అనుభవమవుతుంది. జీవకోటిలో మూలరోగం ఒక్కటే, అదే అహంభావన. దానికి ఔషధం కూడా ఒక్కటే, అదే ఆత్మజ్ఞానం. దానికి వైద్యుడు సద్గురువు మాత్రమే. సకల వేదాంతసారం 'తత్త్వమసి' కేవలం ఉన్నది ఏదో అది నీవై ఉన్నావు. అందువల్లనే నీవు ఎవరో తెలుసుకుంటే సమస్తమునూ తెలుసుకున్నట్లే అంటారు భగవాన్ శ్రీరమణమహర్షి. ఒక్క బ్రహ్మము తప్పించి, మిగిలినవన్నీ దానిపై ఆరోపితములు మాత్రమే! మన స్వస్థితిని అనుభవైకవేద్యం చేసుకోవడానికి ఎదురవుతున్న అడ్డంకులను తొలగించుకోవడమే సాధన. దేహము జీవించియుండగానే దేహాత్మబుద్ధి నుండి విడుదలపొంది, అనంత అద్వయ ఆత్మను తానుగా, నేనుగా, అనుభవైకవేద్యం చేసుకున్నప్పడే ఈ మానవ జీవితము ప్రసాదింపబడిన లక్ష్యం నెరవేరుతుంది. గురుకృప నిరంతరం ఉండనే ఉంది.

**ఓం తత్ సత్**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# నిజమైన చూపుగలవాడే - నిజాన్ని తెలుసుకొంటాడు

మనకు ఎంత డబ్బు ఉన్నా, ఎంత చదువుకొన్నా జ్ఞానమైన చూపులేకపోతే బీదవారిగానే ఉండిపోతాము, ఏడుస్తూ ఉంటాము. ఎంత బీదవారైనా ఎన్ని చిక్కులో ఉన్నా, ఆత్మజ్ఞానం ధనం ఉన్నప్పుడు సంతోషంగా గడుపుతాము. భగవంతుడు సత్యం. భగవాన్ నిమగ్నమైన చూపు శుభాన్ని పొందును. సర్వశక్తివంతుడు అద్వితీయుడు అగు చిదాత్మయే సమస్త పదార్థములందు ఉన్నట్లు చూచేవాడే నిజమైన చూపుగలవాడు. నిజమైన 'నేను'కు అంతా 'తానే' దేహమే తాను అనుకొన్నవానికి ద్వంద్వాలు వస్తాయి. మహాత్ములు మంచివాళ్ళు 'నేను' అనేమాట తప్పనిసరియై ఆతనికి అర్థమవ్వదని మాట్లాడుతారు. 'నేను' అనే మాటను తగ్గిస్తే అది వెనక్కు వెళ్ళి కూరుకుపోతుంది. అదే జీవిత ధ్యేయం. మనం 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను అంటే మిగిలిన వారి సంగతి ఏమిటి? ఈ చరాచర సృష్టి విషయం ఏమిటి? మనది అతి చిన్న ప్రేమ. ప్రేమ అనేది బంధం కాకూడదు. చాలా విశాలంగా విస్తృతంగా ఉండాలి. ప్రేమ మనస్వభావం కావాలి, ప్రకాశం కావాలి అదే నిజమైన చూపు. సెంట్ అగస్టిన్ "నీవు ప్రేమ తప్ప మరేదీ పట్టించుకోకు" అన్నారు. మన హృదయ కుహరంలో కూర్చుంటే మోసపూరితమైన వాసనలను ఒడిసిపట్టుకొన్నప్పుడు తిరుగుబోతు మనస్సును కదలకుండా ఉంచి స్వేచ్ఛగా ఉండగలము. శ్రీ నాన్నగారు "ఇతరులు మనలను వంచన చేస్తూ ఉంటే తప్పకోగలం కాని, మనస్సు చేసే వంచనల నుంచి మనం తప్పకోలేము" అన్నారు. అజ్ఞానమనే చీకటిలో చూపు కనబడకపోతే ప్రమాదంలో పడటం తప్పదు. దానికి నిత్య ఎరుక కావాలి. రూపసౌందర్యంలో మెరిసిపోతున్న స్త్రీని ఆత్మజ్ఞాని అని కేవలం పంచభూతనిర్మితాలతో నిర్మించబడ్డ లిఖించిన చిత్రములేనని అవి గౌణాలని ఏ విలువా లేనిగ భావిస్తాడు నిర్లిప్తంగా. భూమిని దున్నేవానికి రాయిని విగ్రహంగా మలిచేవానికీ మనో నిగ్రహమే కార్యసిద్ధికి ఉపయోగపడుతుంది. ద్వంద్వాలతో చూచే మనస్సుని సత్యంపై ఏకాగ్రం చెయ్యాలంటే అంతే నిగ్రహం కావాలి. మనస్సు ప్రశాంతంగా స్వచ్ఛంగా ఉంచుకోవటమే నైతికతకు తొలి మెట్టు. తప్పను నిర్మొహమాటంగా ఒప్పకొంటే స్వచ్ఛ. దాన్ని కప్పిపుచ్చుకోవటానికి అనేక దారులను వెదకాలి. దాన్ని మరలా ఎల్లకాలం జ్ఞాపకముంచుకోవాలి. నైతికత ప్రధాన భూమికలను పోషిస్తుంది. ఇది అంతా ఆధ్యాత్మిక విద్య ద్వారానే సిద్ధిస్తుంది. రేపటి గురించి భయపడితే వర్తమానాన్ని ఉపయోగించే సామర్థ్యాన్ని మనం కోల్పోతాము. గతం ఏమి అంటుంది అంటే నా అప్ప తీర్చు నన్ను జీవింపనీ, నాలో మునిగిపో అంటుంది. గతం మనలను హింసిస్తుంది, అవమానిస్తుంది, ఆకర్షిస్తుంది, నన్ను ఏమి చేద్దామనుకుంటావు అంటుంది. నేను ఇంకా అసంపూర్ణంగా ఉన్నాను తృప్తిపరచు అని మన నిజమైన చూపును మరల్చుతుంది. నిజమైన ఆత్మ దృష్టి ఉన్నతంగా ఎదిగేలా చేస్తుంది. అది ఒక నిచ్చెనలాంటిది. ఆ మార్గంలో వెళితే గురువుకు ప్రీతి హెచ్చుగా ఉండి అప్పడు వివేకమణి లభించి అన్ని వైపులా బుసలు కొట్టే మనస్సు నశించి ముక్తి లభిస్తుంది.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966